క్లుప్తంగా

నాణ్యమైన విద్యను బోధించాలి



విద్యాబోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు: గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఎంఈఓ–2 ఓంకార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పూడిచెర్ల, కేతవరం పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అలాగే విద్యా కిట్లు పంపిణీ వివరాలపై ఆరాతీశారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయులకు సూచించారు.

నాణ్యత లోపిస్తే చర్యలు



పెసరవాయిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని చీఫ్ ఇంజనీర్ విజయ కుమారి హెచ్చరిచారు. శుక్రవారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీరాజ్ అధికారులు చెప్పిన విధంగా రోడ్లు నాణ్యత చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ భాస్కర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

గడివేముల: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై అర్థమయ్యే రీతిలో బోధన చేసి, ఉన్నత ఫలితాలు రాబట్టాలని సూచించారు. డీఈఓ వెంట ఎస్‌ఓ రుబీనా ఉన్నారు.

శుభకార్యం



వివాహ వేడుకలో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ షతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామానికి వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కంపాటి నరసింహుడి కుమారుడు రంగముని వివాహం శుక్రవారం జరిగింది. కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ నాయకులతో కలిసి శుభకార్యానికి హాజరయ్యారు. వధువరులను ఆశీర్వదించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు సంధ్య విక్రమ్‌కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి వివాహ వేడుకకు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, పులిరాజు, శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలపై నిరసన

కర్నూలు (న్యూసిటీ): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలపై రూ.వేల కోట్ల ఆర్థిక భారం మోపుతూ నడ్డి విరుస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని విద్యుత్ భవనం ముందు లాంతర్లు చేతపట్టుకుని వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలపై రూ.17 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేనిపక్షంలో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షులు షేక్ జిలాని బాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

- టీడీపీ నేతల తీరిది
- రాజకీయ ఆధిపత్యంతో తల్లడిల్లుతున్న అధికారులు
- తప్పని పరిస్థితుల్లో తలూపుతున్న వైనం
- నిబంధనలకు విరుద్ధంగా చురుగ్గా సాగుతున్న రోడ్డు నిర్మాణం



రూ.50 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నగరవనం వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు

కర్నూలు (రూరల్) : టీడీపీ కూటమి ప్రభుత్వంలో తమ్ముళ్ల దౌర్జన్యం మితిమీరుతోంది. ప్రతి విషయంలో జోక్యం చేసుకుంటూ అధికార బలం ప్రదర్శిస్తున్నారు. 'అంతా మా ఇష్టం' అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలతోపాటు అధికారులు సైతం తల్లడిల్లుతున్నారు. తప్పని పరిస్థితుల్లో కొందరు అధికారులు తల ఊపాల్సిన దుస్థితి నెలకొంది. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం నందనపల్లె గ్రామ పంచాయితీ తీర్మానం లేకుండానే 'నగరవనం' అభివృద్ధి పనులు చేపట్టిన తీరు. ఈ అభివృద్ధి పనులు నిబంధనలు విరుద్ధం అంటూ సాక్షి దినపత్రికలో సెప్టెంబర్ 27న 'ఇష్టారాజ్యం' శీర్షికన ప్రచురించిన విషయం తెలిసిందే. అయినా నిబంధనలకు విరుద్ధంగా పనులు సాగుతూనే ఉన్నాయి. జిల్లా కేంద్రం కర్నూలు సమీపాన ఉన్న'నగరవనం' అభివృద్ధి పనులను కోడుమూరు నియోజకర్గంలో ఆధిపత్యం ప్రదర్శించే నేత తనకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆయన మాటంటే శాసనం. ఇంకో విధంగా చెప్పాలంటే 'విష్ణు' చక్రంలా' భయపడుతారు అధికారులు. దీంతో నిబంధనలను పక్కన పెట్టారు. దీంతో పంచాయతీ నిబంధనలు విరుద్ధంగా అధికారులు వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'నగరవనం' వాస్తవానికి నందనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. 'నగరవనం' అభివృద్ధి పనులకు నందనపల్లె గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే చక్రం తిప్పిన నేత ఆదేశాల మేరకు అధికారులు పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా గార్గేయపురం పంచాయతీ అనుమతి తీసుకుని ఏకంగా రూ.50 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపారు. ఈ మేరకు లేక్ వ్యూ, బార్ పాయింట్ నుంచి స్లూయిజ్ గేటు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు మూడువారాల క్రితం చేపట్టారు. ఈ విషయాన్ని ఆ గ్రామ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. తీవ్రంగా ఖండిస్తున్నారు కూడా.



పనులను పర్యవేక్షిస్తున్న కల్లూరు మండల అసిస్టెంట్ ఇంజనీర్ రవిమోహన్‌రెడ్డి, గార్గేయపురం, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ సింధు

మా పంచాయతీ తీర్మానం లేకుండా ఎలా అభివృద్ధి పనులు చేపడుతారంటూ ప్రశ్నిస్తున్నారే తప్పా రాజకీయ బలం నేపథ్యంలో అధికారులను నిలదీయలేని పరిస్థితి. ఉన్నతాధికారులకు మాత్రం చీమ కుట్టినట్లు లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందిస్తారో వేచి చూద్దాం.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనుల పర్యవేక్షణ



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే 'నగరవనం' రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్నా. గతంలో కర్నూలు మండల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించిన అనుభవం మేరకే ఉన్నతాధికారులు ఈ బాధ్యతలు అప్పగించారు అనుకుంటున్నా. నిబంధనల మేరకు పనులు జరుగుతున్నాయి. నాణ్యతగా పనులు చేపడుతున్నాం. ఇతర విషయాలు నన్ను అడగొద్దు.

– రవిమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్, కల్లూరు మండలం

చురుగ్గా సాగుతున్న పనులు

'నగరవనం' రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలనే లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. కల్లూరు మండల అసిస్టెంట్ ఇంజినీర్ రవిమోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ముమ్మరంగా సాగుతున్న తీరును నందనపల్లె ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. కల్లూరు మండలం అసిస్టెంట్ ఇంజినీర్ కర్నూలు మండలంలో జరిగి పనులు ఎలా పర్యవేక్షిస్తారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ విషయాన్ని ఎంపీడీఓ రఘునాథ్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఆ పనులకు సంబంధించి పూర్తి సమాచారం తన వద్ద లేదన్నారు. రెండు రోజుల తర్వాత అయితే పూర్తి వివరాలు చెబుతామన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: కొత్తూరుకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసి శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని శుక్రవారం కాటసాని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగలింగేశ్వరస్వామి దర్శించుకున్నారు. అనంతరం కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి అంకితభావంతో కృషి చేశామని, దాదాపుగా రూ. 2కోట్లపైగానే నిధులు వెచ్చించి పనులు ప్రారంభించామని గుర్తు చేశారు. తాము చేపట్టిన పనులు ఇంకా జరుగుతున్నాయని, త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్తీక మాసం సందర్భంగా



స్వామివారికి పూజలు చేస్తున్న కాటసాని

ప్రతి ఆది, మంగళ వారాల్లో ఆలయానికి భక్తులు తరలివస్తారని, సకల వసుతులు కల్పించాలని చెప్పారు. గ్రామంలో ఓ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువరులను కాటసాని ఆశ్వీర్వదించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, మాజీ ఆలయ చెర్మన్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

సి.బెళగల్: అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ రాణెమ్మ మండల సర్వసభ్య సమావేశంను నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన, చేపట్టనున్న అంశాలను సభలో తెలియజేశారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకున్న రైతులు ప్రీమియం చెల్లించి పంట బీమాను నమోదు చేసుకోవాలని ఏఓ మల్లేష్ కుమార్ తెలిపారు. గోకులం షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రాధాన్యత పనులుగా చేపట్టడం జరుగుతుందని పీఆర్ ఏఈ వెంకటప్రకాష్ అన్నారు. జల్ జీవన్ మిషన్‌లో చేపట్టే పనులకు టెండర్లు వేసేందుకు కాంట్రక్టర్లు ముందుకు రావాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

గోనేనాయక్ సభలో కోరారు. అదేవిధంగా ఏపీఎం రామేశ్వర్, ఏపీఓ రామన్న తమ నివేదికలను వివరించారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ అంశాలు వివరిస్తుండగా ఎంపీపీ జోక్యం చేసుకున్నారు. రైతుల భూములు ఆన్‌లైన్ నుంచి ఎందుకు తొలగిస్తున్నారని ఎంపీపీ మండిపడ్డారు. చెరువులు, పంట కాలువల మరమత్తులు, సాగునీటి సరఫరాపై ఇరిగేషన్ అధికారిపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు నష్టపరిహారం అందజేస్తాం

కర్నూలు (రూరల్) : జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం తప్పకుండా అందజేస్తామని జిల్లా జా యింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య తెలిపారు. కర్నూలు మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గార్గేయపురం గ్రామ సమీపాన చేపట్టిన 340సి నేషనల్ హైవే నిర్మాణంలో కోల్పోయని భూములు పత్రాలను నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవితో కలిసి జేసీ పరిశీలించారు. బాధిత రైతులతో జేసీ మాట్లాడారు. మీ భూములు కోల్పోయింటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, న్యాయం చేస్తామని జేసీ హామీ ఇచ్చారు. అదేవిధంగా నేషనల్ హైవే నిర్మాణంలో సమీపంలో ఉన్న జగనన్న లే అవుట్‌లో బేస్‌మెంట్ నిర్మాణంలోని ప్లాట్లను కోల్పోతున్న వారికి ఆ ఖర్చు మొత్తాన్ని అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు మండల తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



రైతులను విచారిస్తున్న జేసీ డాక్టర్ నవ్య

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సి.బెళగల్: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు కొత్తకోట, పోలకల్, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రెండవ శనివారం మైనర్ మరమత్తులు, నిర్వహణ పనులలో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీఓఏలు

కోడుమూరు రూరల్ : కాలపరిమితి జీఓను రద్దు చేసి వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు గఫూర్‌మియ్యా డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు స్థానిక ఏపీఎం, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పొదుపు సంఘాల మహిళలకు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న వీఓఏల కాలపరిమితి జీఓను రద్దు చేసి ఉద్యోగ భద్రత కోసం హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. వీఓఏలపై రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. తొలగించిన వీఓఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గఫూర్‌మియ్యా ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న, వీఓఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, రామచంద్రుడు, మా రెప్ప, సభ్యులు చంద్రన్న, మధు, వెంకటేష్, పద్మావతి, గాయత్రి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి



సి.బెళగల్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సి.బెళగల్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ రాణెమ్మకు 104 ఉద్యోగులు వినతి పత్రాలు అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు రానందున ఇబ్బందులు పడుతున్నామని సి.బెళగల్ పీహెచ్‌సీ పరిధిలో పనిచేసే 104 వాహన డ్రైవర్ మధు, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 16 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్నామని, నేటికీ సరైన వేతనాలు అందడం లేదన్నారు. జీఓ నంబర్ 7 ప్రకారం వేతనాలను చెల్లించాలని, యాజమాన్యం ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే ఆదోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పులివెందుల జేఎన్‌టీయూ ఇటీవల జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. ఏ హ్యాండ్‌బాల్ పురుషుల విభాగంలో ఈసీఈ విద్యార్థి మణికంఠ, యాదవేంద్రారెడ్డి, మహిళా విభాగంలో సురేఖ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు.

బుగ్గరామేశ్వరుని ఆదాయం రూ.18.18 లక్షలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ వెలసిన బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానంలో ఏడాదిపాటు తాత్కాలికంగా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో రూ.18.18 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ మద్దిలేటి తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షణలో జరిగిన వేలం పాట సాగింది. 2024 డిశంబర్ 1వ తేదీ నుంచి 2025 నవంబర్ 30వ తేదీ వరకు వ్యాపారాలు నిర్వహించుకొనే హక్కులు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. దేవస్థాన పరిధిలో నిర్మంచిన మూడవ దుకాణం, కొబ్బరి చిప్పలు పోగు హక్కు మినహా, మిగతా 10 వ్యాపారాలకు వేలం పాట నిర్వహించారు. మొత్తం రూ.18,18,500 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాదికంటే రూ.3,85,100 అదనంగా ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహన అధికారులు మద్దిలేటి, చంద్రశేఖర్‌రెడ్డి, గుర్రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

అనుమతి లేకుండా ఇసుక తరలించరాదు

కోడుమూరు రూరల్ : కోడుమూరు హంద్రీ నది నుంచి ముందస్తు అనుమతుల్లేకుండా ఎట్టి పరిస్థితుల్లో ఇసుకను తరలించరాదని కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం వర్కూరు హంద్రీనది తహసీల్దార్ సందర్శించారు. హంద్రీ నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లతో తహసీల్దార్ మాట్లాడారు. హంద్రీ నుంచి స్థానికులు మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలని, అది కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అలాకాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇసుకను తీసుకెళ్తే జరిమానా విధిస్తామన్నారు. రెండవసారి పట్టుబడితే సీజ్ చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. అలాగే హంద్రీలో గ్రామ పంచాయతీ బోర్లకు 200మీటర్ల దూరంలో వాల్టా చట్టం ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో ఇసుకను తరలించరాదన్నారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్లకు తహసీల్దార్ జరిమానా విధించారు. తహసీల్దార్ రాకను గమనించిన చాలామంది ట్రాక్టర్ డ్రైవర్లు హంద్రీలో నుంచే తమ తమ ట్రాక్టర్లతో పరారయ్యారు.



ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్

యురేనియం తవ్వకాలపై స్పందించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా దేవనకొండ మండల పరిధిలో యురేనియం తవ్వకాలపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని గోకారి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ యురేనియం తవ్వకాలు ఆపాలని పోరాటం చేసిందన్నారు. అధికారంలోకి రాగానే మాట మార్చి యురేనియం తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం అన్యాయమన్నారు. యురేనియం తవ్వకాలు జరిపితే కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టు సమీపంలోని 15 గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని యురేనియం తవ్వకాలను ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.భాస్కర్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు రూరల్ : సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం కోడుమూరులోని పోలీస్‌స్టేషన్, గోరంట్ల గ్రామాల్లో ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలతో సమావేశమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో చాలామంది ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి నష్టపోతున్నారన్నారు. బ్యాంకు అధికారులు ఎవ్వరూ కూడా ఖాతాదారులకు సమాచారం చెప్పమని ఫోన్లు చేయరని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఫోన్లలో ఓటీపీలు చెప్పరాదని ఎస్ఐ సూచించారు. యువత కూడా సైబర్ నేరగాళ్లకు దూరంగా ఉండాలని, యాప్‌ల్లో రుణాలు ఎట్టి పరిస్థితుల్లో తీసుకోరాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఓర్వకల్లు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నదే ×ఉల్లాస్‌శ కార్యక్రమ ఉద్దేశమని నంద్యాల జిల్లా వయోజన విద్య నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు భవన్‌లో వలంటరీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొదుపు సంఘాలలో నిరక్షరాసులైన సభ్యులకు అక్షరాస్యులుగా మారేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిరక్షరాస్యుల జాబితా ప్రకారం ప్రతి పది మంది మహిళలకు ఒక వలంటరీ ఉపాధ్యాయున్ని నియమిస్తామన్నారు. చదవడం, రాయడం నేర్పించడం జరుగుతుందని, పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి

వయోజనులకు చదువు నేర్పించాలి

సి.బెళగల్: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనులకు చదువు నేర్పించాలని ఉల్లాస్ మండల కో ఆర్డినేటర్ జాకీర్ హుసేన్ సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో వెలుగు ఏపీఎం రామేశ్వర్ ఎంఎంఎస్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాకీర్‌హుసేన్ వయోజనుల విద్యకు చేపట్టాల్సిన అంశాలను స్వచ్ఛంద శిక్షకులకు వివరించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు రాముడు, మాదులు, శ్రీనివాసులు, గుండమయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జాకీర్‌హుసేన్

కల్లూరు: మహిళలకు ఆర్థికఅంశాలపై అవగాహన ఉండాలని, అందుకు విద్య అవసరమని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పొదుపు మహిళలకు అక్షరాస్యతపై శిక్షణ ఎంపీడీఓ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో నిరక్షరాస్యత మహిళకు చదవు చెప్పడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత మీద అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉల్లాస్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఈఓఆర్డీ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.